సాక్షి అనంతపురం

శనివారం । 22 । జూన్ । 2024



హాస్టల్ రూపురేఖలు మారాలి

హాస్టల్‌లో మౌలికసదుపాయాలు మెరుగు పరచకపోతే శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని జేసీ కేతన్‌గార్గ్ హెచ్చరించారు. 8లో



చీనీ టన్ను రూ.32 వేలు

అనంతపురం వ్యవసాయ మార్కెట్ యార్డులో శుక్రవారం చీనీకాయలు టన్ను గరిష్ట ధర రూ.32 వేలు పలికినట్లు అధికారులు తెలిపారు.

గరిష్టం/కనిష్టం

35.5°/23.6°

జిల్లా అంతటా శుక్రవారం ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమైంది. నైరుతి దిశగా గంటకు 8 నుంచి 12 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.

న్యూస్‌రీల్

ప్రజాప్రయోజన కేసులపై అవగాహన



మాట్లాడుతున్న ఉమ్మడి జిల్లా న్యాయమూర్తి జి.శ్రీనివాస్

అనంతపురం: న్యాయ సేవా సదన్‌లో వివిధ ప్రజా ప్రయోజన సేవ శాఖల ప్రభుత్వ అధికారులకు శాశ్వత లోక్ అదాలత్‌లో ప్రజా ప్రయోజన కేసుల పరిష్కారంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఉమ్మడి అనంతపురం జిల్లా ప్రజా ప్రయోజనాల శాశ్వత లోక్ అదాలత్ ధర్మాసనం చైర్మన్/ న్యాయమూర్తి కె.శ్రీనివాస రావు అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా జిల్లా న్యాయమూర్తి జి.శ్రీనివాస్ హాజరై మాట్లాడారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ద్వారా ఉచిత న్యాయ సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో శాశ్వత లోక్ అదాలత్ సభ్యులు ఎం.రాజశేఖర్‌రెడ్డి, ప్రధాన న్యాయ సహాయ ప్రతివాద న్యాయవాది ఇటికె నల్లప్ప పాల్గొన్నారు.

ప్రశాంతంగా బీసీ గురుకుల ప్రవేశ పరీక్ష



పరీక్ష రాస్తున్న విద్యార్థులు

అనంతపురం ఎడ్యుకేషన్: ఉమ్మడి జిల్లాలోని మహాత్మ జ్యోతిబా పూలే బీసీ గురుకుల పాఠశాలల్లో 6, 7, 8, 9 తరగతుల్లో ఖాళీగా ఉన్న సీట్ల భర్తీకి బీసీ వెల్ఫేర్ అధికారి కుష్బూ కొఠారి, బీసీ గురుకుల పాఠశాలల కన్వీనర్ సంగీత కుమారి పర్యవేక్షణలో నిర్వహించిన రాత పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. నార్పల బీసీ గురుకుల పాఠశాలలో గురువారం 6, 8 తరగతులకు, శుక్రవారం 7, 9 తరగతులకు పరీక్ష నిర్వహించారు. మొత్తం 63 సీట్లకు 1,301 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకోగా 957 మంది హాజరయ్యారు.

ఆసియన్ లాక్రోస్ గేమ్‌కు రాధిక



రాధికను సత్కరిస్తున్న కలెక్టర్

అనంతపురం: ఆసియన్ లాక్రోస్ గేమ్స్ (మహిళలు) ఉజ్బెకిస్తాన్‌లోని సమ్మర్‌కండ్‌లో జూలై 1 నుంచి 4 వరకు జరగనున్నాయి. ఇందులో ఇండియన్ లాక్రోస్ టీమ్‌కు అనంతపురానికి చెందిన రాధిక ఎంపికైంది. ఈ సందర్భంగా రాధికను కలెక్టర్ వినోద్‌కుమార్ శుక్రవారం అభినందించి, ఘనంగా సత్కరించారు.

ఇంటర్ అర్హతతో ఉద్యోగం

- ఇంటర్ బోర్డు, హెచ్‌సీఎల్ టెక్ సంస్థ ఆధ్వర్యంలో నేడు జాబ్‌మేళా

అనంతపురం ఎడ్యుకేషన్: ఇంటర్ పూర్తికాగానే విద్యార్థులు సాఫ్ట్‌వేర్ ఉద్యోగులుగా మారే అవకాశం హెచ్‌సీఎల్ కంపెనీ కల్పిస్తోందని ఇంటర్ బోర్డు ఆర్ఐఓ వెంకటరమణనాయక్ తెలిపారు. ఈ మేరకు ఆయన శుక్రవారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఇంటర్మీడియెట్ బోర్డు, హెచ్‌సీఎల్ టెక్‌బీ సంయుక్త ఆధ్వర్యంలో శనివారం ఉదయం 9 గంటలకు అనంతపురంలోని బాలుర ఐటీఐలో జాబ్‌మేళా ప్రారంభం నిర్వహిస్తామని తెలిపారు. జిల్లాలో 2022-23, 2023-24 విద్యా సంవత్సరాల్లో ఇంటర్ పూర్తి చేసిన, ప్రస్తుత విద్యా సంవత్సరంలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థులు ఈ ఉద్యోగాలకు అర్హులని వెల్లడించారు. 75 శాతం మార్కులతో ఇంటర్ పూర్తి చేసిన అన్ని గ్రూపుల విద్యార్థులు జాబ్‌మేళాకు రావొచ్చని పేర్కొన్నారు. అభ్యర్థులు ఉదయం 8 గంటలకే ఐటీఐ కాలేజీకి చేరుకోవాలని సూచించారు. ఎంపిక ప్రక్రియలో భాగంగా తొలుత క్యాట్ ఎగ్జామ్, ఇంటర్వ్యూ, చివరిగా ఇంగ్లిష్ వర్సంట్ పరీక్ష నిర్వహిస్తారని తెలిపారు. ఈ మూడింటిలో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులకు ఏడాది పాటు శిక్షణ ఇస్తారని, ఈ కాలంలో నాలుగో నెల నుంచి నెలకు రూ.10 వేల చొప్పున స్టయిఫండ్ ఇస్తారని వెల్లడించారు. బైపీసీ, సీఈసీ, హెచ్ఈసీ, ఒకేషనల్ కోర్సులు చదివిన వారు అడ్మినిస్ట్రేషన్‌కు సంబంధించి డీపీఓ విభాగంలో కూడా ఉద్యోగాలు పొందవచ్చని తెలిపారు. పదో తరగతి, ఇంటర్ మార్కుల జాబితా, ఆధార్ కార్డు, రెండు పాస్‌పోర్ట్ సైజు ఫొటోలు వెంట తీసుకురావాలని పేర్కొన్నారు.

యోగాతో ఆరోగ్యం

- యోగా.. జీవితంలో భాగం కావాలి
- అంతర్జాతీయ యోగా దినోత్సవంలో వక్తలు

అనంతపురం పోలీసు పరేడ్ మైదానంలో ఆసనాలు వేస్తున్న కలెక్టర్ వినోద్‌కుమార్, ఎస్పీ గౌతమి శాలి, జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ, సీఈఓ నిదియాదేవి, కమిషనర్ మేఘస్వరూప్ తదితరులు



అనంతపురం కల్చరల్: ఒత్తిడి లేని జీవితానికి యోగా చక్కటి పరిష్కార మార్గమని కలెక్టర్ వినోద్ కుమార్ అన్నారు. శారీరక, మానసిక ఆరోగ్యానికి యోగా ఎంతో ఉపయోగపడుతుందన్నారు. శుక్రవారం 'మహిళా సాధికారత కోసం యోగా' అనే అంశంతో సాగిన పదో అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా ఆయుష్, యోగాసన స్పోర్ట్స్ అసోసియేషన్, వివిధ యోగా కేంద్రాల సంయుక్త ఆధ్వర్యంలో నగరంలోని పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో సామూహిక యోగాసనాలు నిర్వహించారు. ముఖ్య అతిథులుగా కలెక్టర్ వినోద్‌కుమార్, ఎస్పీ గౌతమి శాలి, జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, నగరపాలక సంస్థ డిప్యూటీ మేయర్ వాసంతి సాహిత్య, కమిషనర్ మేఘ స్వరూప్, జెడ్పీ సీఈఓ వైఖోమ్ నిదియా దేవి, బీజేపీ జిల్లా అధ్యక్షులు సందిరెడ్డి శ్రీనివాస్ తదితరులు హాజరై జ్యోతిప్రజ్వలన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఒత్తిడి నిండిన జీవితాలకు యోగా అత్యవసరమని గుర్తించి పాఠశాల నుంచే యోగా అభ్యసించేలా చేయాలన్నారు. మన పూర్వీకులందించిన గొప్ప విద్య యోగా అని, దీనికి అందరూ ప్రాధాన్యతనివ్వాలని సూచించారు. బ్రహ్మకుమారీల ఇన్‌చార్జ్ సిస్టర్ శారద, వివేకానంద యోగా కేంద్ర అధ్యక్షులు రాజశేఖరరెడ్డి మాట్లాడుతూ యోగా అందరి జీవితంలో భాగం కావాలని, అపుడే ఆరోగ్యకరమైన సమాజం నిర్మించగలమన్నారు. యోగా శిక్షకురాలు కృష్ణవేణి అందరితో ప్రాణాయామం, సామూహిక యోగా, సామూహిక ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ విజయభాస్కరరెడ్డి, ఆర్డీఓ వెంకటేష్, డీపీఓ ప్రభాకరరావు, బీసీ వెల్ఫేర్ డీడీ ఖుష్బు కొఠారి, ఆయుష్, హోమియో శాఖల అధికారులు తిరుపతి నాయుడు, డాక్టర్ రామకుమార్, డీపీఆర్వో గురుస్వామి, డీఎంహెచ్ఓ ఈబీ దేవి, ఐసీడీఎస్ పీడీ శ్రీదేవి, యోగా గురువులు దివాకర్‌తో పాటు పలు శాఖల అధికారులు, సిబ్బంది సామూహిక యోగాసనాలు వేశారు.





యోగాసనాలు వేస్తున్న విద్యార్థులు, ఉద్యోగులు, ప్రజలు

సుబ్రమణ్యేశ్వరాలయంలో చోరీ



సంఘటన స్థలాన్ని పరిశీలిస్తున్న డీఎస్పీ

గార్లదిన్నె: ప్రసిద్ధ కోటంక కొండలోని గుంటి సుబ్రమణ్యేశ్వర ఆలయంలో చోరీ జరిగింది. అర్ధరాత్రి వేళ దుండగులు చొరబడి హుండీలు పగులగొట్టి, బీరువాలు తెరిచి అందులోని బంగారు, వెండి ఆభరణాలతో పాటు నగదుతో ఉడాయించారు. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. కోటంక సుబ్రమణ్యేశ్వర స్వామి ఆలయ ప్రధాన అర్చకులు రామాచార్యులు గురువారం రాత్రి 7.30 గంటలకు పూజలు నిర్వహించిన అనంతరం తలుపులకు తాళం వేసి ఇంటికి వెళ్లారు. శుక్రవారం ఉదయం ఓ భక్తుడు ఆలయం వద్దకు వెళ్లగా తలుపులు తెరచి ఉండడం, పూజారులెవరూ లేకపోవడం గమనించి వెంటనే ఆలయ కమిటీ సభ్యులు, ఈఓ బాబుకు తెలియజేశారు. వారి ద్వారా సమాచారం అందుకున్న అనంతపురం డీఎస్పీ వెంకటశివారెడ్డి, సీఐ శ్రీధర్, ఎస్ఐ మహమ్మద్ గౌస్ హుటాహుటిన సంఘటన స్థలాన్ని పరిశీలించారు. ఈఓ బాబు, సీఐ శ్రీధర్ మాట్లాడుతూ అర్ధరాత్రి దుండగులు ఆలయం వద్దకు చేరుకుని తలుపులు పగులగొట్టి లోనికి ప్రవేశించినట్లు తెలుస్తోందన్నారు. నాలుగు హుండీల్లో రెండు పగులగొట్టి భక్తులు సమర్పించిన నగదు తదితర కానుకలు ఎత్తుకుపోవడంతో పాటు గర్భగుడికి కన్నం వేసి లోనికి ప్రవేశించి బీరువాలోని 8 తులాల బంగారం ఆభరణాలు, 7.5 కిలోల వెండి అన్నీ కలిపి 19 రకాల ఆభరణాలు దొంగిలించినట్లు వెల్లడించారు. డాగ్ స్క్వాడ్‌తో తనిఖీలు చేపట్టి.. వేలి ముద్రలు సేకరించారు. ఈఓ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

నాణ్యత ప్రమాణాల మదింపు పూర్తి



జేఎన్‌టీయూ అనంతపురం పాలక భవనం

- 75 ఇంజినీరింగ్ కళాశాలలకు ఏఐసీటీఈ గుర్తింపు
- కళాశాలల్లో ముగిసిన నిజనిర్ధారణ కమిటీల పరిశీలన

అనంతపురం: ఇంజినీరింగ్ అడ్మిషన్ల ప్రక్రియ ప్రారంభం కానున్న నేపథ్యంలో ఆయా కళాశాలల్లో నాణ్యత ప్రమాణాల మదింపు కోసం నియమించిన నిజనిర్ధారణ కమిటీ(ఫ్యాక్ట్స్ అండ్ ఫైండ్ కమిటీ)ల పరిశీలన పూర్తయింది. ఇంజినీరింగ్ కళాశాలలు ప్రతి ఏటా ఏఐసీటీఈ (ఆల్ ఇండియా కౌన్సిల్ ఫర్ టెక్నికల్ ఎడ్యుకేషన్) అనుమతి పొందాల్సి ఉంటుంది. అనంతరం యూనివర్సిటీ అనుబంధ హోదా గుర్తింపు తీసుకోవాలి. ఈ క్రమంలో 2024-25 విద్యా సంవత్సరానికి సంబంధించి జేఎన్‌టీయూ అనంతపురం పరిధిలో మొత్తం 75 ఇంజినీరింగ్ కళాశాలలకు ఏఐసీటీఈ అనుమతి మంజూరు చేసింది. అనంతరం యూనివర్సిటీ అనుబంధ హోదాకు ఆయా ఇంజినీరింగ్ కళాశాలలు దరఖాస్తు చేసుకోవడంతో నిజనిర్ధారణ కమిటీలను నియమించింది. ఇంజినీరింగ్ కళాశాలల్లో నాణ్యత ప్రమాణాలు, విద్యార్థి, అధ్యాపక నిష్పత్తి, అధ్యాపకుల అర్హతలు, గ్రంథాలయం, ఆటస్థలం, ప్రయోగశాలలు, కళాశాల క్యాంటీన్, విద్యార్థుల హాస్టల్ సదుపాయాలు, కళాశాలలకు న్యాక్ గ్రేడింగ్ ఉందా.. లేదా.. వంటి అంశాలన్నింటినీ సమగ్రంగా పరిశీలించాల్సిన బాధ్యత నిజ నిర్ధారణ కమిటీ సభ్యులదే. గత మూడు రోజుల నుంచి నిజ నిర్ధారణ కమిటీలు ఆయా కళాశాలలను పరిశీలించి నివేదికను అందజేశాయి. శుక్రవారం కమిటీల పరిశీలన ముగిసింది. పాలక మండలి అనుమతి అనంతరం ఇంజినీరింగ్ కళాశాలలకు సీట్లు కేటాయించనున్నారు. ఏపీ ఈఏపీసెట్ కౌన్సెలింగ్ లోపే ఈ ప్రక్రియ పూర్తి చేయాల్సి ఉండడంతో జేఎన్‌టీయూ అనంతపురం ఉన్నతాధికారులు ఈ మేరకు చర్యలు తీసుకున్నారు.

మొదలైన విత్తన కార్తెలు

- జూలై ఆఖరు వరకు విత్తుకు అదను



ఏరువాక మొదలు పెట్టిన రైతులు

అనంతపురం అగ్రికల్చర్: వ్యవసాయ పంచాంగం ప్రకారం శుక్రవారం మృగశిర కార్తె ముగిసింది. శనివారం 'ఆరుద్ర' ప్రవేశించనుంది. ఆరుద్ర కార్తె అనగానే రైతుల మోములు వికసిస్తాయి. మనపూర్వీకుల నుంచి ఈ కార్తెతో రైతులకు చాలా అవినాభావ సంబంధం ఉంది. మంచి వర్షాలు పడి ఈ కార్తెలో విత్తనం పడితే తప్పనిసరిగా పంట పండుతుందని రైతుల విశ్వాసం. ముంగారు విత్తన కార్తెలు ఆరుద్రతో మొదలై పుష్యమితో ముగుస్తాయి. ప్రధానంగా శనివారం మొదలు కానున్న ఆరుద్ర జూలై 6న ముగుస్తుంది. జూలై 6 నుంచి 20 వరకు పునర్వసు కార్తె ఉంటుంది. జూలై 20 నుంచి ఆగస్టు 3 వరకు పుష్యమి కార్తె ఉంటుంది. ఈ మూడు కార్తెలు ఖరీఫ్ పంటలు వేసుకునేందుకు అదనుగా భావిస్తారు. అందులోనూ ఆరుద్ర, పునర్వసులో విత్తుకునేందుకు రైతులు మొగ్గు చూపుతారు. ఈ రెండు కార్తెలు విత్తుకు మంచి అదనుగా భావిస్తారు. ఒక వేళ వర్షాలు ఆలస్యమైతే పుష్యమిలో విత్తుకుంటారని చెబుతున్నారు. ఆ తర్వాత వేరుశనగ, కంది, ఆముదం, పత్తి లాంటి ప్రధాన పంటలు వేసుకోకపోవడం మంచిదని గట్టిగా చెబుతారు. శాస్త్రవేత్తలు కూడా జూన్ 15 నుంచి జూలై 15 వరకు మంచి అదనుగా ప్రకటించారు. వర్షాలు ఆలస్యమైతే జూలై ఆఖరు వరకు చెబుతారు. ఆగస్టులో ప్రత్యామ్నాయ పంటలే శరణ్యమనేది తెలిసిన విషయమే. రైతులు వ్యవసాయ పనులు మొదలుపెట్టే ఏరువాక పౌర్ణమి కూడా శుక్రవారం ముగిసింది. వ్యవసాయశాఖ ఎక్కడా ఏరువాక పౌర్ణమి నిర్వహించకపోవడం గమనార్హం.

ఖరీఫ్ సాగు 3.46 లక్షల హెక్టార్లు అంచనా

ఈ ఏడాది మే రెండో పక్షంలో ముందస్తుగా తొలకరి వర్షాలు బాగా కురిశాయి. ఆ తర్వాత ఈ నెల 2న ప్రవేశించిన 'నైరుతి' రుతుపవనాలు ప్రభావంతో చూపడంతో 15వ తేదీ వరకు జిల్లా అంతటా విస్తారంగా వర్షాలు పడ్డాయి. దీంతో కొందరు రైతులు ఏరువాక ముందస్తుగానే మొదలు పెట్టారు. తీరా ఇపుడు మంచి అదను కావడంతో పూర్తి స్థాయిలో సాగుకు సన్నద్ధంగా ఉన్నారు. అక్కడక్కడ విత్తు కార్యక్రమాలు కొనసాగిస్తున్నా... ఇపుడు మరోసారి మంచి వర్షం పడాలని కోరుకుంటున్నారు. ఇంకా సమయం ఉన్నందున వర్షాలు పడే సూచనలు ఉన్నట్లు చెబుతుండటంతో ఈ ఖరీఫ్‌లో 3.46 లక్షల హెక్టార్లలో సాగు కావొచ్చనే ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. అందులో వేరుశనగ 2 లక్షల హెక్టార్లుగా అంచనా వేశారు.

- జూన్ నెల సాధారణ వర్షపాతం 61 మి.మీ కాగా జూన్ 15 నాటికే ఏకంగా 140 మి.మీ వర్షపాతం నమోదైంది. ఆ తర్వాత తేలికపాటికే పరిమితమైంది. జూన్ నుంచి సెప్టెంబర్ వరకు ఖరీఫ్ నాలుగు నెలల కాలంలో 319.7 మి.మీ వర్షపాతం నమోదు కావాల్సి ఉంటుంది. అందులో జూన్‌లో 61 మి.మీ, జూలైలో 63.9 మి.మీ, ఆగస్టులో 83.8 మి.మీ, సెప్టెంబర్‌లో 110.9 మి.మీ వర్షపాతం నమోదైతే ఖరీఫ్‌కు ఢోకా ఉండదని అంచనా వేస్తున్నారు.

లక్ష్యం ఉంటేనే సాధించగలరు

- విద్యార్థులతో కలెక్టర్ వినోద్‌కుమార్



మాట్లాడుతున్న కలెక్టర్ వినోద్‌కుమార్

కణేకల్లు: విద్యార్థులు లక్ష్యం (గోల్) పెట్టుకుంటే అనుకున్నది సాధించవచ్చని కలెక్టర్ వినోద్‌కుమార్ సూచించారు. కణేకల్లు కేజీబీవీని కలెక్టర్ శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో ముచ్చటించారు. చదువుకుని ఏమవుతారని ప్రశ్నించగా.. ఒక విద్యార్థిని డాక్టర్, మరొక విద్యార్థిని ఇంజినీర్ అవుతానని సమాధానమిచ్చారు. టీచర్, సైంటిస్టు, కబడ్డీ, అథ్లెటిక్ ప్లేయర్స్ కావాలని లేదా అని కలెక్టర్ అడిగారు. ప్రతి ఒక్కరూ బాగా చదివి ఉన్నత శిఖరాలు అధిరోహించాలన్నారు. ఏ విద్యార్థి ఏ గోల్ పెట్టుకున్నారో వివరంగా రాసి పెట్టాలని ఎస్‌ఓ మంజులను ఆదేశించారు. తాను మరోసారి వచ్చి అందరినీ కలుస్తానని చెప్పారు. విద్యార్థులకు చదువుతో పాటు క్రీడలు కూడా చాలా ముఖ్యమని, వారికి ఆడుకునే సౌకర్యం కల్పించాలని ఎస్‌ఓను ఆదేశించారు. ఇక్కడ డార్మెటరీ సమస్య తీవ్రంగా ఉందని, తరగతి గదుల కొరత ఉందని ఎస్‌ఓ కలెక్టర్ దృష్టికి తెచ్చారు. కణేకల్లు చెరువు నిండితే బ్యాక్‌వాటర్ స్కూల్ ఆవరణలోకి వస్తాయని, రాకపోకలకు చాలా ఇబ్బందిగా ఉంటుందని సిబ్బంది కలెక్టర్‌కు తెలియజేశారు. కలెక్టర్ వెంట ఆర్డీఓ రాణీసుస్మిత, తహసీల్దార్ ఇందిరారాణి, ఎంపీడీఓ గూడెన్న, పంచాయతీ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ ప్రసాద్ ఉన్నారు.

పరిసరాలు శుభ్రంగా ఉంచుకోండి

పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని కలెక్టర్ సూచించారు. కణేకల్లులో శుక్రవారం కలెక్టర్ విస్తృతంగా పర్యటించారు. తొలుత చిక్కణ్ణేశ్వరస్వామి ఆలయానికెదురుగా ఉన్న వీధిలో పరిసరాలు, ఇంటి ఆవరణలు పరిశీలించారు. డ్రమ్ములు, తొట్టెల్లో నీరు ఎక్కువ రోజులు నిల్వ చేసుకుంటే దోమలు పెరిగి జ్వరాలు వ్యాపింపజేస్తాయన్నారు. ప్రతి శుక్రవారం డ్రైడేను తప్పనిసరిగా పాటించాలన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ ఆదేశాల మేరకు ఎంఎల్‌హెచ్‌పీ వెన్నెలతో స్థానిక మహిళకు డ్రైడే గురించి అవగాహన కల్పించారు. అనంతరం సీజనల్ వ్యాధులు, ప్రజల ఆరోగ్యం గురించి ఎప్పటికప్పుడు ఆరోగ్య సిబ్బంది అవగాహన కల్పించేలా చూడాలని జిల్లా మలేరియా అధికారి ఓబులును కలెక్టర్ ఆదేశించారు. తర్వాత కణేకల్లు-3 సచివాలయం వద్ద సర్పంచ్ నిర్మల, సిబ్బందితో కలిసి కలెక్టర్ మొక్కలను నాటారు. కార్యక్రమంలో డీపీఓ ప్రభాకర్‌రావు, అసిస్టెంట్ మలేరియా అధికారి సత్యనారాయణ, సబ్‌యూనిట్ అధికారి నాగేంద్ర ప్రసాద్, ఏఓ శ్రవణ్‌కుమార్ పాల్గొన్నారు.

బ్రిక్స్ లైబ్రరీలో 'అనంత' చరిత్ర

అనంతపురం కార్పొరేషన్: బ్రిక్స్ దేశాల (బ్రెజిల్, రష్యా, ఇండియా, చైనా, దక్షిణాఫ్రికా) లైబ్రరీలో అనంతపురం జిల్లాకు సంబంధించిన పుస్తకానికి చోటు దక్కిందని నగర మేయర్ వసీం తెలిపారు. రష్యాలోని కజాన్‌లో జరిగిన బ్రిక్స్ దేశాల మేయర్ల సమావేశంలో ఆయన పాల్గొన్నారు. సమావేశం అనంతరం అక్కడి విశేషాలను ఫోన్ ద్వారా 'సాక్షి'కి వెల్లడించారు. బ్రిక్స్ దేశాల సంఘంలో భాగంగా ఈ నెల 21న రష్యాలోని కజాన్ నగరంలో జరిగిన మేయర్ల సదస్సుకు వివిధ దేశాలకు చెందిన 50 మందికి పైగా మేయర్లు హాజరయ్యారన్నారు. మన దేశం నుంచి అనంతపురంతో పాటు జైపూర్, కాలికట్, త్రిస్సూర్, నాగర్‌కోయిల్ మేయర్లు సమావేశంలో పాల్గొన్నారన్నారు. 16వ శతాబ్దంలో మొదటి రష్యన్ యాత్రికుడు అఫానసీ నికిటిన్ అప్పటి విజయనగర సామ్రాజ్యంలో భాగమైన అనంతపురాన్ని సందర్శించారని, ఈ సందర్భన ప్రాముఖ్యత కారణంగానే కజాన్‌లో జరిగిన అసోసియేషన్ వ్యవస్థాపక సమావేశంలో పాల్గొనే అరుదైన అవకాశం తనకూ దక్కిందన్నారు. ద్వైపాక్షిక, వాణిజ్య తదితర అంశాలపై విస్తృత స్థాయిలో చర్చ సాగిందన్నారు. సమావేశంలో తాను మన జిల్లా గొప్పతనం, ప్రజల జీవన విధానం, వారసత్వ సంపదను వివరించినట్లు తెలిపారు. జిల్లా సంస్కృతి, సంప్రదాయాలపై తాను మాట్లాడుతున్నప్పుడు అందరూ ఎంతో ఆసక్తిగా విన్నారన్నారు. సమావేశంలో పాల్గొనడం ద్వారా ఆయా దేశాల్లోని ప్రధాన నగరాల అభివృద్ధికి చేపట్టిన చర్యలు తెలుసుకోగలిగానన్నారు. అక్కడ పర్యావరణ పరిరక్షణకు చేపట్టిన చర్యలను అనంతపురం నగరంలోనూ అమలు చేసేలా చర్యలు తీసుకుంటామన్నారు. అనంతపురం నగర చరిత్ర, జిల్లాకు సంబంధించిన సమగ్ర సమాచారంతో ముద్రించిన పుస్తకాన్ని తాను అందజేయగా ఆ పుస్తకాన్ని అందరూ చదువుకునేందుకు వీలుగా బ్రిక్స్ లైబ్రరీలో అందుబాటులో ఉంచనున్నట్లు నిర్వాహకులు తెలిపారన్నారు.





రష్యాలోని కజాన్‌లో సమావేశమైన బ్రిక్స్ దేశాల మేయర్లు(ఇన్‌సెట్‌లో) సమావేశంలో పాల్గొన్న అనంతపురం నగర మేయర్ వసీం

లింగ నిర్ధారణ తీవ్రమైన నేరం

అనంతపురం అర్బన్: గర్భస్థ పిండ లింగ నిర్ధారణ తీవ్రమైన నేరమని, ఇలాంటి చర్యలకు పాల్పడే స్కానింగ్ సెంటర్లపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ వినోద్‌కుమార్ సంబంధిత అధికారులను ఆదేశించారు. గర్భస్థ పిండ లింగ నిర్ధారణ నిషేధిత చట్టం (పీసీపీఎన్‌డీటీ యాక్ట్) అమలుపై కలెక్టర్ శుక్రవారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో జిల్లాస్థాయి మల్టీ మెంబర్ అప్రాప్రియేట్ అథారిటీ కమిటీ సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ లింగ నిర్ధారణ చట్టప్రకారం నేరం అనే బోర్డు తప్పనిసరిగా ప్రతి స్కానింగ్ సెంటర్‌లో ప్రముఖంగా ప్రదర్శించేలా చర్యలు తీసుకోవాలని చెప్పారు. ఎక్కడైనా లింగ నిర్ధారణకు పాల్పడుతున్నట్లు గుర్తిస్తే వెంటనే చట్టపరంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. స్కానింగ్ అనేది గర్భంలోని బిడ్డ ఆరోగ్య పరిస్థితి తెలుసుకోవడానికే తప్ప శిశువు ఆడ, మగ అని తెలుసుకోవడానికి కాదన్న విషయాన్ని స్కానింగ్ సెంటర్ల వైద్యులు, సిబ్బంది తెలుసుకోవాలన్నారు. ఆడపిల్ల ప్రాముఖ్యతను ప్రజలకు తెలియజేయాల్సిన బాధ్యత అందరిపైనా ఉందన్నారు. రైల్వే స్టేషన్లు, బస్టాండ్లు, సినిమా హాళ్లు, జన సంచారం అధికంగా ఉండే ప్రదేశాల్లో ఈ చట్టం గురించి అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశించారు. ఇదే క్రమంలో మాతృ మరణాలకు గల కారణాలను నిశితంగా పరిశీలించి, వాటిని అరికట్టేందుకు ప్రత్యేక ప్రణాళిక రూపొందించుకుని అమలు చేయాలని ఆదేశించారు. సమావేశంలో డీఎంహెచ్ఓ భ్రమరాంబదేవి, ఆర్డీటీ సంస్థ హెల్త్ డైరెక్టర్ శిరప్ప, నోడల్ అధికారి యుగంధర్, మాస్ మీడియా అధికారి ఉమాపతి, ఉప డెమో త్యాగరాజు, గంగాధర్, వేణుగోపాల్, న్యాయ సలహాదారు ఆషారాణి, వెంకటేష్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఎస్సీ బాలుర హాస్టల్ పరిశీలన



బ్రహ్మసముద్రంలోని హాస్టల్ పరిసరాలను పరిశీలిస్తున్న జేడీ మధుసూదన్‌రావు

బ్రహ్మసముద్రం : మండల కేంద్రంలోని ఎస్సీ బాలుర హాస్టల్‌ను జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ జేడీ మధుసూదన్‌రావు, ఏడబ్ల్యూఓ దామోదరరెడ్డి శుక్రవారం మధ్యాహ్నం ఆకస్మిక తనిఖీ చేశారు. మౌలిక వసతులు, పరిసరాలు, విద్యార్థుల హాజరు శాతాన్ని పరిశీలించారు. నాణ్యమైన భోజనంతో పాటు ఆహ్లాదకరమైన వాతావరణం ఉండేలా చూడాలని సూచించారు. కార్యక్రమంలో హాస్టల్ వార్డెన్ శ్రీనివాసులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఇంటర్ విద్యార్థులకు ఉద్యోగంతో పాటు ఉచిత డిగ్రీ

అనంతపురం: ఇంటర్మీడియట్ పూర్తి చేసిన విద్యార్థులకు ఏఎఫ్ ఎకాలజీ సెంటర్ ఆధ్వర్యంలో ఉద్యోగంతో పాటు ఉచితంగా డిగ్రీ చదువుకునేందుకు అవకాశం కల్పిస్తున్నారు. ఈ మేరకు ఆ సెంటర్ డైరెక్టర్ వైవీ మల్లారెడ్డి శుక్రవారం ఓ ప్రకటన విడుదల చేశారు. 20 సంవత్సరాల్లోపు వయస్సు, 2023, 2024లో ఇంటర్మీడియట్ (బైపీసీ, ఎంపీసీ, ఎంఎల్‌టీ విత్ బ్రిడ్జి కోర్సు) ఉత్తీర్ణులైన వారు అర్హులు. ఎంపికైన వారు టెక్నికల్ ట్రైనీగా ఉద్యోగం చేయాల్సి ఉంటుంది. పదో తరగతిలో 60 శాతంతో ఉత్తీర్ణత ఉండాలి. దరఖాస్తు చేసుకున్న వారికి ఈ నెల 24న అనంతపురం శివారులోని ఉప్పరపల్లి రోడ్డులో ఉన్న ఏఎఫ్ ఎకాలజీ సెంటర్‌లో ఇంటర్వ్యూలు నిర్వహిస్తారు. పూర్తి వివరాలకు 63032 04295, 91820 63878లో సంప్రదించవచ్చు.

బొలెరో ఢీకొని వ్యక్తి మృతి

కళ్యాణదుర్గం రూరల్: బొలెరో వాహనం ఢీకొన్న ఘటనలో ఓ వ్యక్తి మృతిచెందాడు. పోలీసులు తెలిపిన మేరకు... కంబదూరు మండలం కొత్తూరు గ్రామానికి చెందిన నరసింహులు(45) వ్యక్తిగత పనిపై శుక్రవారం బొట్టువానిపల్లికి వెళ్లాడు. పని ముగించుకున్న ఆయన ద్విచక్ర వాహనం స్వగ్రామానికి వెళుతుండగా దేవేంద్రపురం గ్రామం గేట్ వద్ద వెనుక నుంచి వేగంగా వచ్చిన బొలెరో వాహనం ఢీకొంది. ఘటనలో నరసింహులు కాలు, చెయ్యి విరిగాయి. ప్రమాదానికి కారణమైన డ్రైవర్ వాహనాన్ని ఆపకుండా ముందుకు దూసుకెళ్లిపోయాడు. గమనించిన స్థానికులు వెంటనే క్షతగాత్రుడిని ఆస్పత్రికి చేర్చారు. ప్రథమ చికిత్స అనంతరం అనంతపురానికి రెఫర్ చేశారు. చికిత్సకు స్పందించక ఆయన మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. కాగా, ప్రమాదం జరిగిన వెంటనే విషయం తెలుసుకున్న పోలీసులు అప్రమత్తమై బొలెరో వాహనాన్ని వెంబడిస్తూ పీటీఆర్ పల్లి వద్ద డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నారు. ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.



తెర చాటున దానిమ్మ

ఆధునిక వ్యవసాయ పద్ధతులను అందిపుచ్చుకున్న రైతులు పంటల సాగులో వైవిధ్యాన్ని కనబరుస్తున్నారు. ఉద్యాన తోటల సాగులో మరింత మెలకువలు పాటిస్తున్నారు. ఈ క్రమంలో తెగుళ్ల బారి నుంచి దానిమ్మ పంటను కాపాడుకునేందుకు ఓ రైతు వినూత్నంగా ఆలోచించి, ఆచరణలో పెట్టాడు. కూడేరు మండలం పీఏబీఆర్ వద్ద రైతు అంజి తనకున్న మూడు ఎకరాల్లో సాగు చేసిన దానిమ్మ పంట విరగ్గాసింది. ఈ క్రమంలో కాయల నాణ్యత దెబ్బతినకుండా మొత్తం చెట్టుకే తెరను చుట్టి పెట్టాడు. ఫలితంగా తాను ఆశించినట్లుగానే నాణ్యమైన దిగుబడులు సాధిస్తున్నాడు.

- సాక్షి ఫొటోగ్రాఫర్, అనంతపురం:

టీడీపీ దాడులు అమానుషం

- వైఎస్సార్‌సీపీ హయాంలో రూ.3,500 కోట్లతో ఉరవకొండ నియోజకవర్గ అభివృద్ధి
- నియోజకవర్గాన్ని మంత్రి కేశవ్ మరింత అభివృద్ధి చేస్తారని ఆశిస్తున్నా
- ఐదేళ్లూ ప్రజల పక్షాన పోరాటాలు సాగిస్తాం
- విలేకరుల సమావేశంలో మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి

ఉరవకొండ: గత ఐదేళ్లూ తమ ప్రభుత్వం అధికారంలో ఉన్నా ఏ ఒక్క రోజూ టీడీపీ శ్రేణులపై దాడులు చేసిన దాఖలాలు లేవని, అయితే టీడీపీ ప్రభుత్వం ఏర్పాటైన కొన్ని రోజుల వ్యవధిలోనే ఉరవకొండ నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ శ్రేణులపై వరుస దాడులు చోటు చేసుకోవడం బాధాకరమని మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి అన్నారు. టీడీపీ దాడులు అమానుషమన్నారు. శుక్రవారం స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఉరవకొండ నియోజకవర్గంలోని ఐదు మండలాలకు చెందిన పార్టీ నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. పార్టీ శ్రేణులకు మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి, యువనేత వై.ప్రణయ్‌రెడ్డి ధైర్యం చెబుతూ అండగా ఉంటామంటూ భరోసానిచ్చారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో విశ్వ మాట్లాడారు. ఉరవకొండ పట్టణంలో వైఎస్సార్‌సీపీ మైనార్టీ నాయకులు, ఉపసర్పంచ్‌లపై దాడులను ఖండించారు. ఇది మంచి పద్ధతి కాదని, ఈ విషసంస్కృతిని వీడాలని టీడీపీ నాయకులు, కార్యకర్తలకు సూచించారు. లేకుంటే ప్రతిఘటించడానికి తామంతా సిద్ధంగా ఉన్నామన్నారు.

దశాబ్దాలుగా పేరుకు పోయిన సమస్యలకు పరిష్కారం

ఉరవకొండ నియోజకవర్గ వ్యాప్తంగా దశాబ్దాలుగా పేరుకుపోయిన ఎన్నో సమస్యలకు గత ఐదేళ్ల జగన్ సర్కార్‌లో పరిష్కారం చూపామన్నారు. 3వేల మందికి ఇంటి పట్టాలు మంజూరు చేయడంతో పాటు, పక్కా గృహాలు నిర్మించి ఇచ్చామన్నారు. రూ.3,500 కోట్లతో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను పక్కాగా అమలు చేశామన్నారు. వివిధ సంక్షేమ పథకాల కింద రూ.2,500 కోట్ల లబ్ధిని రాజకీయాలకు అతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ అందజేశామన్నారు. రూ.వెయ్యి కోట్లతో వివిధ అభివృద్ధి పనులు పూర్తి చేశామన్నారు.

కేశవ్‌కు క్యాబినెట్ హోదా దక్కడాన్ని స్వాగతిస్తున్నా

దశాబ్దాల తర్వాత ఉరవకొండకు క్యాబినెట్ హోదా దక్కిందని, దీనిని స్వాగతిస్తూ మంత్రి కేశవ్‌ను అభినందిస్తున్నానన్నారు. మంత్రిగా నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి చేస్తారని ఆకాంక్షిస్తున్నానన్నారు. గత ప్రభుత్వంలో అప్పటి సీఎం జగన్ ఉరవకొండలో నిర్వహించిన ఆసరా సభలో మాట్లాడుతూ... నియోజకవర్గంలో సాగు నీటి కష్టాలు తీర్చేందుకు రూ.2,062 కోట్లు మంజూరు చేస్తామని భరోసానిచ్చారని గుర్తు చేశారు. అయితే అనూహ్యంగా కూటమి అధికారంలోకి వచ్చినందున ఆ నిధులను చంద్రబాబు ప్రభుత్వం నుంచి రాబట్టి నియోజకవర్గ సాగు నీటి కష్టాలు దూరం చేయడంపై మంత్రి కేశవ్ దృష్టి సారించాలన్నారు. హంద్రీనీవా ద్వారా 76 వేల ఎకరాలకు సాగునీరు అందించేలా డిస్ట్రిబ్యూటరీలు, ఫీల్డ్ చానల్ నిర్మాణం, వజ్రకరూరు మండలంలోని చెరువులకు నీటిని అందించేలా మైనర్ ఇరిగేషన్ ట్యాంకుల నిర్మాణం, జీడిపల్లి గ్రామానికి ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ పునరావాసం కల్పించాల్సిన బాధ్యత కేశవ్‌పై ఉందన్నారు. సమావేశంలో ఎంపీపీ నరసింహులు, మార్కెట్ యార్డు చైర్‌పర్సన్ సుశీలమ్మ, వైస్ ఎంపీపీ వై.శ్రీనాథరెడ్డి, పార్టీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు వీరన్న, పంచాయతీ రాజ్ విభాగం అధ్యక్షుడు బసవరాజు, కురుబ, ఎంబీసీ కార్పొరేషన్ల డైరెక్టర్లు గోవిందు, వెంకటేష్, మాజీ జెడ్పీటీసీ తిప్పయ్య తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా శ్రీగిరి రథోత్సవం



రథాన్ని లాగుతున్న భక్తులు

పుట్టపర్తి రూరల్: పౌర్ణమి సందర్భంగా శుక్రవారం సాయంత్రం సత్యసాయి శ్రీగిరి రథోత్సవం వైభవంగా నిర్వహించారు. ప్రతి పౌర్ణమి నాడు శ్రీగిరి రథోత్సవం నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. ప్రశాంతి నిలయం ముఖ ద్వారం వద్ద అందంగా అలంకరించిన రథంపై సత్యసాయి చిత్రపటాన్ని ఉంచి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం సత్యసాయిని కీర్తిస్తూ రథాన్ని లాగారు. ప్రశాంతి నిలయం, విద్యాగిరి, గోకులం, ఎనుములపల్లి, గణేష్ కూడలి, చింత తోపు, శివాలయం వీధి, హనుమాన్ కూడలి, గోవిందయ్యపేట, పెద్ద బజార్ మీదుగా తిరిగి ప్రశాంతి నిలయానికి చేర్చారు. ఉత్సవంలో దేశ విదేశాలకు చెందిన భక్తులు పాల్గొన్నారు.

కోనుప్పలపాడు ఘటనలో 27 మందిపై కేసు నమోదు

- వైఎస్సార్‌సీపీ నేతల ఫిర్యాదుపై స్పందించని పోలీసులు
- ఘటన జరిగిన రోజే బాధితుల ఫిర్యాదు
- 30 రోజుల తర్వాత టీడీపీ నేత చేసిన ఫిర్యాదుపై వెంటనే కేసు నమోదు
- పోలీసుల తీరుపై వెల్లువెత్తిన విమర్శలు

యాడికి: సార్వత్రిక ఎన్నికల సందర్భంగా యాడికి మండలం కోనుప్పలపాడులో ఇరు వర్గాల మధ్య చోటు చేసుకున్న గొడవకు సంబంధించి మొత్తం 27 మందిపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ మేరకు ఇన్‌చార్జ్ సీఐ జనార్దననాయుడు తెలిపారు. వైఎస్సార్‌సీపీకి చెందిన పలువురు తనపై దాడి చేశారంటూ టీడీపీకి చెందిన ఓబన్న ఇచ్చిన ఫిర్యాదు మేరకు విచారణ అనంతరం 27 వైఎస్సార్‌సీపీ నాయకులపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ యాక్ట్ కింద కేసులు నమోదు చేసినట్లు వివరించారు. కాగా, ఘటన జరిగిన రోజు వైఎస్సార్‌సీపీ నేతలు గంగిరెడ్డి, మంగల చంద్ర, బాలకృష్ణపై టీడీపీకి చెందిన 70 మంది రాళ్లతో దాడి చేసిన విషయం తెలిసిందే. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన వైఎస్సార్‌సీపీ నాయకుల ఫిర్యాదు మేరకు పోలీసులు ఎలాంటి కేసు నమోదు చేయకపోవడం విమర్శలకు దారి తీస్తోంది. అలాగే అధికారాన్ని, కులాన్ని అడ్డు పెట్టుకుని ఎన్నికలు ముగిసిన దాదాపు 30 రోజులకు పైబడిన తర్వాత ఈ నెల 19న టీడీపీ నాయకుడు ఓబన్న ఇచ్చిన ఫిర్యాదును పరిగణనలోకి తీసుకుని వైఎస్సార్‌సీపీ నాయకులపై పోలీసులు తక్షణమే కేసులు బనాయించడం దుర్మార్గమని ఈ సందర్భంగా పలువురు ఆవేదన వ్యక్తం చేశారు. నిష్పాక్షపాతంగా వ్యవహరించాల్సిన పోలీసులు అధికార పార్టీకి కొమ్ము కాస్తుండడం బాధాకరమని పేర్కొన్నారు.

4 రోజుల్లో హాస్టల్ రూపురేఖలు మారాలి

- సంబంధిత అధికారులకు జేసీ కేతన్‌గార్గ్ ఆదేశం
- ఆరు బయటే స్నానాలు చేస్తున్న విద్యార్థులు
- నీటి సౌకర్యం లేక ముళ్లకంపల్లో మలవిసర్జన
- హాస్టల్ తనిఖీలో వెలుగు చూసిన వైనం



శెట్టూరు ఎస్సీ బాలుర హాస్టల్ వార్డెన్‌పై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న జేసీ కేతన్‌గార్గ్

శెట్టూరు: అసంబద్ధంగా ఉన్న హాస్టల్‌లో నాలుగు రోజుల్లోపు మౌలిక సదుపాయాలు మెరుగుపడాలని, లేకుంటే శాఖాపరమైన చర్యలకు సిద్ధం కావాలని శెట్టూరు ఎస్సీ బాలుర వసతి గృహం వార్డెన్ షరీఫ్‌బాషాను జేసీ కేతన్‌గార్గ్ హెచ్చరించారు. శుక్రవారం ఆయన స్థానిక సాంఘిక సంక్షేమ శాఖ ఎస్సీ బాలుర వసతి గృహాన్ని ఆకస్మిక తనిఖీ చేశారు. వంట గది, స్టాక్ రూమ్‌లో బియ్యం, కందిపప్పు, చిక్కీ తదితర సరుకుల నాణ్యత, విద్యార్థుల గదులు, మరుగుదొడ్లు పరిశీలించారు. గదులన్నీ అపరిశుభ్రంగా ఉండడంతో సిబ్బందిపై అసహనం వ్యక్తం చేశారు.

70 మందికి 3 లీటర్ల పాలా!

హాస్టల్‌లో విద్యార్థుల సంఖ్యను ఆరా తీయడంతో మొత్తం 70 మంది ఉన్నారని వార్డెన్ షరీఫ్‌బాషా సమాధానమిచ్చారు. రోజుకు ఎన్ని లీటర్ల పాలు తీసుకుంటున్నారని ప్రశ్నించడంతో మూడు లీటర్లు అని వంట మనిషి మహబూబీ తెలిపారు. దీంతో జేసీ ఆశ్చర్యపోయారు. 70 మందికి 3 లీటర్ల పాలు ఎలా సరిపోతాయని ప్రశ్నించారు. ఈ క్రమంలోనే రోజు వారీ మెనుపై జేసీ అడిగిన ప్రశ్నకు సరైన సమాధానం చెప్పలేకపోవడంతో సిబ్బందిపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. హాస్టల్‌లో విద్యుత్ వైర్లు కిందకు వేలాడుతుండడం, సరైన వైరింగ్, బల్బులు, ఫ్యాన్లు లేకపోవడాన్ని గమనించి మండల ఎలక్ట్రికల్ ఏఈ జయకృష్ణపై మండిపడ్డారు. తక్షణమే సౌకర్యవంతమైన జీవితాన్ని వదిలి క్షేత్రస్థాయిలో పనిచేయాలని ఆదేశించారు. తీసుకుంటున్న జీతానికి సరైన న్యాయం చేయాలన్నారు.

అన్నీ సమస్యలే...

హాస్టల్ విద్యార్థులతో జేసీ సమావేశమై సమస్యలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా పలు సమస్యలను విద్యార్థులే ఏకరవు పెట్టారు. హాస్టల్‌లో ఉన్న హెల్పర్ మద్యం మత్తులో విధులకు హాజరవుతుంటారన్నారు. వంటమనిషి మహబూబీ విధులకు హాజరు కాకుండా ఇతర వ్యక్తులతో వంట చేయిస్తోందన్నారు. మెనూ ప్రకారం భోజనం ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. రుచి లేకపోవడంతో భోజనాన్ని తినలేకపోతున్నామన్నారు. దోమల విపరీతంగా ఉన్నాయని, దీంతో రాత్రంతా జాగారణ చేయాల్సి వస్తోందని వాపోయారు. ఆరు బయటే స్నానాలు చేస్తున్నామన్నారు. మరుగుదొడ్లు ఉన్న నీటి వసతి లేక పోవడంతో ముళ్ల కంపల్లోకి వెళ్లాల్సి వస్తోందన్నారు. రాత్రి సమయాల్లో టాయిలెట్‌కు వెళ్లటానికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నామన్నారు. పరిసరాలు శుభ్రతలేక కంపుకొడుతున్నాయని, ఇప్పటికైనా తమ ఇబ్బందులు గుర్తించి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరారు.

స్పందించిన జేసీ

హాస్టల్‌లో నెలకొన్న సమస్యలను విద్యార్థుల ద్వారా తెలుసుకున్న జేసీ కేతన్‌గార్గ్ వెంటనే స్పందించారు. అక్కడే ఉన్న సోషల్ వెల్ఫేర్ జేడీ మధుసూదన్, తహసీల్దార్ శ్రీదేవి, ఎంపీడీఓ నరసింహమూర్తి, ఎంఈఓ శ్రీధర్, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులతో సమావేశమై మాట్లాడారు. నాలుగు రోజుల్లోపు వసతి గృహంలో అన్ని రకాల మౌలిక సౌకర్యాలు మెరుగు పడాలని ఆదేశించారు. హాస్టల్లో ఇప్పటి వరకూ విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించకపోవడం బాధాకరమన్నారు. సీజనల్ వ్యాధుల బారిన పడకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రహరీ నిర్మాణం చేపట్టాలన్నారు. ఈ నెల 25న మరోసారి తాను హాస్టల్ పరిశీలనకు వస్తానని అప్పటికి ఈ పనులన్నీ పూర్తి చేసి ఉండాలన్నారు. లేకపోతే శాఖపరమైన చర్యలకు సిద్ధంగా ఉండాలని హెచ్చరించారు.

విద్యతోనే వ్యక్తికి గౌరవం

హాస్టల్ పరిశీలన అనంతరం పక్కనే ఉన్న జెడ్పీ ఉన్నత పాఠశాలను జేసీ సందర్శించారు. అంతర్జాతీయ యోగ దినోత్సవం సందర్భంగా విద్యార్థులు వేస్తున్న ఆసనాలు గమనించారు. అనంతరం పాఠశాలలో చదువుతూ జాతీయ ఫుట్‌బాల్ పోటీలో పాల్గొన్న విద్యార్థి సవ్యను అభినందించారు. తాను కూడా ఇలాంటి పాఠశాల స్థాయి నుంచే వచ్చానని, ఇష్టంతో చదువుకుని తల్లిదండ్రులకు, జిల్లాకు మంచిపేరు తీసుకోరావాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ కుమార్, ప్రధానోపాధ్యాయుడు ఫిరోజ్ ఖాన్, ఉపాధ్యాయులు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

అగ్రి పాలిటెక్నిక్ కోర్సులకు దరఖాస్తుల ఆహ్వానం



బుక్కరాయసముద్రం: ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం పరిధిలో ఉన్న రెడ్డిపల్లి వ్యవసాయ పాలిటెక్నిక్ కళాశాలలో ప్రవేశాలకు అర్హులైన విద్యార్థుల నుంచి దరఖాస్తుల స్వీకరణ గడువు పెంపు చేశారు. ఈ మేరకు ఆ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వసుంధర శుక్రవారం ఓ ప్రకటన విడుదల చేశారు. పదో తరగతి ఉత్తీర్ణులైన వారు అర్హులు. ఆసక్తి ఉన్న వారు ఈ నెల 30 తేదీ లోపు దరఖాస్తులను అందజేయాల్సి ఉంటుంది. పూర్తి వివరాలకు రెడ్డిపల్లిలోని వ్యవసాయ పాలిటెక్నిక్ కళాశాలలో సంప్రదించవచ్చు.

నాలుగేళ్ల బాలుడిపై వీధి కుక్కల దాడి



నాని గొంతు కింద అయిన గాయం

గుత్తి: స్థానిక ఎస్సీ కాలనీకి చెందిన అశోక్, సురేఖ దంపతుల కుమారుడు నాలుగేళ్ల నానిపై శుక్రవారం రాత్రి వీధి కుక్కలు దాడి చేశాయి. ఇంటి ఎదుట ఆడుకుంటుండగా అటుగా వచ్చిన రెండు కుక్కలు ఉన్నఫళంగా బాలుడిపై విరుచుకుపడ్డాయి. స్థానికులు గమనించి కుక్కలను అదిలించడంతో ప్రమాద తీవ్రత తగ్గింది. అప్పటికే తీవ్రంగా గాయపడిన బాలుడిని తల్లిదండ్రులు వెంటనే ఆస్పత్రికి తీసుకెళ్లి, చికిత్స చేయించారు.

చిన్నారి ఆచూకీని పసిగడతాం : ఎస్పీ



నార్పలలో పావని తల్లితండ్రులతో మాట్లాడుతున్న ఎస్పీ గౌతమిశాలి

నార్పల: మండల కేంద్రంలో గురువారం అదృశ్యమైన చిన్నారి పావని ఆచూకీని పసిగట్టి తల్లిదండ్రుల చెంతకు చేరుస్తామని ఎస్పీ గౌతమిశాలి అన్నారు. శుక్రవారం నార్పల పర్యటనకు వచ్చిన ఆమె బాధిత తల్లిదండ్రులతో మాట్లాడారు. ధైర్యంగా ఉండాలని తొందర్లోనే చిన్నారి ఆచూకీ తెలుసుకుంటామని భరోసానిచ్చారు. ఈ సందర్భంగా ఆమె వెంట సీఐ శ్రీధర్, ఎస్ఐ రాజశేఖరరెడ్డి ఉన్నారు.

ఫిజియోథెరపిస్ట్ పోస్టుల భర్తీకి ఇంటర్వ్యూలు



ఇంటర్వ్యూ నిర్వహిస్తున్న ఏపీసీ నిదియాదేవి

అనంతపురం ఎడ్యుకేషన్: సమగ్ర శిక్ష పరిధిలోని భవిత కేంద్రాల్లో ప్రత్యేక అవసరాల పిల్లలకు సేవలందించే ఫిజియోథెరపీ పోస్టుల భర్తీకి శుక్రవారం ఇంటర్వ్యూలు నిర్వహించారు. సమగ్ర శిక్ష కార్యాలయంలో ఏపీసీ వైఖోమ్ నిదియాదేవి ఆధ్వర్యంలో ఇంటర్వ్యూలు జరిగాయి. రెండు పోస్టులకు గాను ఏడుగురు అభ్యర్థులు హాజరయ్యారు. ఏపీసీతో పాటు కమిటీ సభ్యులుగా ఉన్న ఇద్దరు వైద్యులు, ఐఈ కో-ఆర్డినేటర్ షమా పాల్గొన్నారు. కాంట్రాక్ట్ పద్ధతిలో ఫిజియోథెరపి పోస్టులను భర్తీ చేయనున్నట్లు ఈ సందర్భంగా షమా తెలిపారు.

విత్తన దుకాణాల్లో విజిలెన్స్ అధికారుల తనిఖీ



రికార్డులు పరిశీలిస్తున్న విజిలెన్స్ అధికారులు

గార్లదిన్నె: మండలంలోని కల్లూరులో ఉన్న విత్తన విక్రయ దుకాణాలను శుక్రవారం ఉదయం విజిలెన్స్ అధికారులు ఆకస్మిక తనిఖీ చేశారు. న్యూసందిని సీడ్స్, న్యూ అమృత సీడ్స్ దుకాణాల్లో రికార్డులు పరిశీలించారు. తనిఖీల్లో ప్రొడ్యూస్ సర్టిఫికేట్ చూపించుకోవడం, భౌతిక నిల్వల్లో వ్యత్యాసాలు, స్టాక్ బోర్డు రిజిస్టర్ నిర్వహణలో లోపాలను గుర్తించారు. రూ.1.08 లక్షలు విలువ చేసే 24.80 క్వింటాళ్ల వరి విత్తనాల విక్రయాలు నిలుపుదల చేస్తూ నోటీసులు జారీ చేశారు. తనిఖీల్లో విజిలెన్స్ అధికారులు మాసూమ్‌బాషా, ఫణిప్రకాష్, ఎస్ఐ ఫణీంద్రనాథరెడ్డి, గార్లదిన్నె ఏఓ సోమశేఖర్ పాల్గొన్నారు.

మెగా లోక్ అదాలత్‌ను విజయవంతం చేయాలి



లోక్ అదాలత్‌పై చర్చిస్తున్న ఏడీజే శైలజ తదితరులు

హిందూపురం అర్బన్: న్యాయవాదులు, కక్షదారులు, పోలీసులు సమన్వయంతో ఈ నెల 29న నిర్వహించనున్న మెగా లోక్ అదాలత్‌ను విజయవంతం చేయాలని జిల్లా అదనపు జడ్జి కంపల్లె శైలజ పేర్కొన్నారు. శుక్రవారం అదనపు జిల్లా కోర్టు ఆవరణంలో సీనియర్ సివిల్ జడ్జి శ్రీధర్‌తో కలిసి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీస్ అధికారులతో స్టేషన్ల వారీగా పెండింగ్‌లో ఉన్న కేసులు లోక్ అదాలత్‌లో పరిష్కారమయ్యే అవకాశం ఉందా? లేదా అన్న విషయంపై చర్చించారు. అనంతరం ఏడీజే మాట్లాడుతూ చిన్న పాటి తగాదాలు, ఆర్థిక లావాదేవీలు, భార్య భర్తల మధ్య చోటు చేసుకున్న మనస్పర్థలు, భూతగాదాలు తదితర వాటిల్లో కోర్టుల్లో కేసులు వేయడం ద్వారా ఆర్థికంగా దెబ్బతినడంతో పాటు మానసికంగా కూడా ఇబ్బందులు ఎదురవుతాయన్నారు. అందుకే లోక్ అదాలత్ ద్వారా రాజీమార్గంలో సామరస్య పూర్వకంగా సమస్యలు పరిష్కరించుకోవచ్చన్నారు. సమావేశంలో సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ సుకుమార్, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు రాజశేఖర్, వివిధ స్టేషన్ల ఎస్ఐలు, లోక్ అదాలత్ సిబ్బంది శారద, హేమావతి పాల్గొన్నారు.

క్లుప్తంగా

2.5 క్వింటాళ్ల పచ్చిమిర్చి అమ్మకం



రైతుబజార్‌లో ఏర్పాటు చేసిన పచ్చిమిర్చి కౌంటర్

అనంతపురం అగ్రికల్చర్: స్థానిక రైతుబజార్‌లో ఏర్పాటు చేసిన కౌంటర్‌లో శుక్రవారం కిలో రూ.42 ప్రకారం పచ్చిమిరప అమ్మకాలు చేసినట్లు ఎస్టేట్ అధికారి ప్రతాప్, సూపర్‌వైజర్ లోకేష్ తెలిపారు. వైఎస్సార్ కడప జిల్లా పులివెందుల నుంచి తెప్పించిన 5 క్వింటాళ్లలో తొలిరోజు 2.5 క్వింటాళ్ల మిరపను విక్రయిమచినట్లు పేర్కొన్నారు. శనివారం కూడా మిరప కౌంటర్ పని చేస్తుందని తెలిపారు.

బడిఈడు పిల్లలను బడిలో చేర్పించాలి



న్యామద్దెల సర్కిల్‌లో ర్యాలీ చేపట్టిన విద్యార్థులు

చెన్నేకొత్తపల్లి: బడిఈడు పిల్లలను తప్పనిసరిగా బడిలో చేర్పించాలని విద్యాశాఖ అధికారులు సూచించారు. శుక్రవారం మండల కేంద్రంలో ఎంఈఓ-1 మున్వర్ బాషా, ఎంఈఓ-2 ప్రసన్నకుమార్ నాయుడు, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్ఎం ఓబుళమ్మ ఆధ్వర్యంలో నేను బడికి పోతా కార్యక్రమం నిర్వహించారు. ఉన్నత పాఠశాల నుంచి ప్రారంభమైన ర్యాలీ ప్రధాన రహదారి గుండా స్థానిక న్యామద్దెల సర్కిల్ వరకు సాగింది. అక్కడ విద్యార్థులు మానవహారంగా ఏర్పడి నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఎంఈఓలు మాట్లాడుతూ.. బడి బయట పిల్లలను గుర్తించి బడిలో చేరే విధంగా చూడాలన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి శ్యామల, ఎస్సీ బాలుర వసతి గృహం అధికారి శంకర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


హోర్డింగ్స్ తొలగింపు



హోర్డింగ్స్‌ను తొలగిస్తున్న టౌన్ ప్లానింగ్ సిబ్బంది

అనంతపురం కార్పొరేషన్: నగరపాలక సంస్థ కమిషనర్ మేఘ స్వరూప్ ఆదేశాలతో నగరంలోని వివిధ ప్రాంతాల్లో అనధికారికంగా వేసిన హోర్డింగ్స్‌ను టౌన్ ప్లానింగ్ సిబ్బంది తొలగించేలా చర్యలు తీసుకున్నారు. శుక్రవారం టీపీఓ శిరీష పర్యవేక్షణలో టౌన్ ప్లానింగ్ సిబ్బంది జూనియర్ కళాశాల, తదితర ప్రాంతాల్లో ఉంచిన హోర్డింగ్స్‌ను తొలగించారు.

'నీట్' అవకతవకలపై నిరసన



అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న ఇండియా కూటమి నాయకులు

కనగానపల్లి: భారత ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించడంలో ఎన్‌డీఏ ప్రభుత్వం విఫలమైందని కాంగ్రెస్, వామపక్ష పార్టీల నాయకులు విమర్శించారు. వైద్య, విద్య కోసం దేశ వ్యాప్తంగా నిర్వహించిన నీట్ అవకతవకలపై శుక్రవారం ఇండియా కూటమి నాయకులు కనగానపల్లిలో నిరసన వ్యక్తం చేశారు. దేశంలో ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించాలని డా.బాబా సాహెబ్ అంబేద్కర్ విగ్రహం వద్ద వినతిపత్రం ఉంచి నిరసన తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల కన్వీనర్ బిల్లే ముత్యాలు, సీపీఎం నాయకులు కదిరప్ప, పలువురు విద్యార్థి సంఘం నాయకులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో సత్యదేవుడి వ్రతం



వ్రతం జరిపిస్తున్న స్వామీజీ

అనంతపురం కల్చరల్: జ్యేష్ట పౌర్ణమిని పురస్కరించుకుని శుక్రవారం రాత్రి శివకోటి ఆలయంలో సత్యనారాయణ స్వామి వ్రతం కనుల పండువగా జరిగింది. సత్యదేవుని నామస్మరణతో ఆలయం మార్మోగింది. స్వామిని సర్వాంగ సుందరంగా అలంకరించి వందలాది మంది భక్తులతో శివయ్య స్వామీజీ సామూహిక సత్యదేవుని వ్రతాన్ని శాస్త్రోక్తంగా జరిపించారు. ఐదు వ్రతకథలలో రమా సమేత సత్యనారాయణ స్వామి ప్రాముఖ్యతను భక్తులకు వివరించారు. కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లిగా కలియుగంలో సత్యదేవుడి వ్రతానికి మించినది లేదన్నారు. అనంతరం ఆలయంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు, తీర్థప్రసాద వితరణ జరిగాయి.

యోగాతో ప్రశాంతత



అనంతపురం ఆర్ట్స్ కళాశాలలో యోగా చేస్తున్న దృశ్యం



ఆత్మకూరులో యోగా చేస్తున్న విద్యార్థినులు



యోగా గురువులు, విద్యార్థులను సన్మానిస్తున్న జేఎన్‌టీయూ అనంతపురం వీసీ ప్రొఫెసర్ జీవీఆర్ శ్రీనివాస రావు

అనంతపురం మెడికల్: ఆరోగ్యవంతమైన జీవితానికి యోగాను భాగం చేసుకోవాలని వైద్య కళాశాల ప్రిన్సిపాల్, డీన్ డాక్టర్ మాణిక్యరావు, జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ కేఎస్ఎస్ వెంకటేశ్వర రావు పేర్కొన్నారు. శుక్రవారం ప్రభుత్వ వైద్య కళాశాల ఆడిటోరియంలో అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని నిర్వహించారు. మొదటగా ప్రిన్సిపాల్, సూపరింటెండెంట్ జ్యోతి ప్రజ్వలన చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. యోగా సాధన చేయడం ద్వారా మానసిక స్థైర్యంతో పాటు ప్రశాంతత లభిస్తుందన్నారు. రోజూ యోగా సాధన తప్పక చేయాలన్నారు. సూపరింటెండెంట్ డాక్టర్ కేఎస్ఎస్ వెంకటేశ్వర రావు మాట్లాడుతూ.. దీర్ఘకాలిక సమస్యలు ప్రాణాయామంతో నయం అవుతాయన్నారు. అనంతరం యోగా శిక్షకులు మారుతిప్రసాద్, హార్ట్‌ఫుల్ నెస్ మెడిటేషన్ యోగా శిక్షకులు డాక్టర్ శంకర్‌నారాయణ, ప్రాణాయామ యోగ శిక్షకులు ముద్దారి నాని నవోమిల పర్యవేక్షణలో అందరితో యోగాసనాలు చేయించారు. కార్యక్రమంలో ఆర్ఎంఓ డాక్టర్ పద్మజ, డిప్యూటీ ఆర్ఎంఓ డాక్టర్ హేమలత, ప్రొఫెసర్లు డాక్టర్ తెలుగు మధుసూదన్, డాక్టర్ ఉమామహేశ్వర రావు, డాక్టర్ సుచిత్రకౌరి, నర్సింగ్ సూపరింటెండెంట్ రజిని, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ ఆదిరెడ్డి పరదేశీనాయుడు, పీడీ నరసింహ నాయక్, నర్సింగ్ అసోసియేషన్ శ్రీదేవి, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ నర్సింగ్ కళాశాలలో..

అనంతపురం మెడికల్: ప్రతి ఒక్కరికి యోగా తప్పనిసరి అని ప్రభుత్వ నర్సింగ్ కళాశాల ప్రిన్సిపాల్ లలిత పేర్కొన్నారు. శుక్రవారం ప్రభుత్వ నర్సింగ్ కళాశాలలో యోగా దినోత్సవాన్ని నిర్వహించారు. యోగా శిక్షకురాలు అరుణ అధ్యాపక బృందం, నర్సింగ్ విద్యార్థులతో ప్రాణాయామం, యోగాసనాలు చేయించారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ.. ప్రస్తుత పోటీ ప్రపంచంలో మానసిక ఒత్తిళ్లతో అధిక సంఖ్యలో ప్రజలు అవస్థలు పడుతున్నారన్నారు. ప్రధానంగా విద్యార్థి దశ నుంచే యోగా సాధన చేయాలన్నారు. కార్యక్రమంలో అధ్యాపక బృందం భాగ్యరాణి, అనురాధ, తదితరులు పాల్గొన్నారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం

రాప్తాడు: యోగాతో సంపూర్ణ ఆరోగ్యం సాధ్యం. రోజూ యోగా చేయడం ద్వారా ఆరోగ్యానికి మేలు చేకూరుతుందని డ్వామా పీడీ వేణుగోపాల్ రెడ్డి తెలిపారు. అంతార్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని రాప్తాడులోని చెరువు వద్ద ఉపాధి కూలీలతో యోగాసనాలు వేయించారు. అలాగే మండలంలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో యోగా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా డ్వామా పీడీ మాట్లాడుతూ.. యోగా చేయడం ద్వారా శరీరం, మనసు అనుసంధానమై ఏకాగ్రత, జ్ఞాపకశక్తి పెరుగుతుందన్నారు. కార్యక్రంలో ఎంపీడీఓ గీతావాణి, తహసీల్దార్ సీతారాం, చిన్నారి హస్పిటల్ ఎండీ హరిప్రసాద్, ఈఓఆర్డీ నరసింహా రెడ్డి, ఏపీఎంలు సావిత్రి ఓబన్న, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు నాగరత్న, హేమలత పాల్గొన్నారు.

జేఎన్‌టీయూలో..

అనంతపురం: జేఎన్‌టీయూ అనంతపురంలో శుక్రవారం అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జేఎన్‌టీయూ అనంతపురం వీసీ ప్రొఫెసర్ జీవీఆర్ శ్రీనివాస రావు హాజరై మాట్లాడారు. యోగా ప్రపంచ వ్యాప్తంగా ఎంతో ఆదరణకు నోచుకుందన్నారు. 5 వేల సంవత్సరాల చరిత్ర గల యోగాతో శరీరంతో పాటు మెదడు, ఆత్మ ఇలా అన్నింటిపైనా ప్రభావం చూపిస్తుంది. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ప్రొఫెసర్ సి. శశిధర్, కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఎస్వీ సత్యనారాయణ, స్పోర్ట్స్ కౌన్సిల్ జోజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎస్కేయూలో..

శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం ఇంజినీరింగ్ కళాశాలలో జరిగిన కార్యక్రమంలో వీసీ ప్రొఫెసర్ కే.హుస్సేన్ రెడ్డి, రెక్టార్ ప్రొఫెసర్ జి. వెంకట నాయుడు, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఎంవీ లక్ష్మయ్య, ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఏ.కృష్ణకుమారి, ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్ .రామచంద్ర, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ సి. ధనుంజయ తదితరులు పాల్గొన్నారు.

సెంట్రల్ వర్సిటీలో..

సెంట్రల్ యూనివర్సిటీ ఆఫ్ ఏపీలో అంతర్జాతీయ యోగా దినోత్సవ కార్యక్రమం సందర్భంగా యోగాసనాలు నిర్వహించారు. వీసీ ప్రొఫెసర్ ఎస్ఏ కోరి ఆధ్వర్యంలో కార్యక్రమాలు చేపట్టారు. వర్సిటీ డీన్ సి. షీలా రెడ్డి మాట్లాడుతూ.. మానసిక ప్రశాంతత, సామరస్యత వైపు చేసే ప్రయాణమే యోగా అన్నారు.

అనంతపురం ఎడ్యుకేషన్: ప్రపంచ మానవాళికి మన దేశం ఇచ్చిన కానుక యోగా అని పలువురు వక్తలు గుర్తు చేశారు. అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని శుక్రవారం నగరంలోని వివిధ విద్యా సంస్థల్లో ఘనంగా జరుపుకున్నారు. మానసిక ఒత్తిడిని ఎదుర్కోవడంలో యోగా కీలకపాత్ర పోషిస్తుందన్నారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు, అధ్యాపకులు, విద్యార్థులు వివిధ యోగాసనాలు చేశారు.

ఘనంగా యోగా దినోత్సవం

అనంతపురం కల్చరల్: అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకలు నెహ్రూ యువకేంద్రం, జన శిక్షణా సంస్థ, పతంజలి యోగకేంద్రం ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా జరిగాయి. కేఎస్ఎన్ ఆడిటోరియంలో ఎన్‌వైకే ప్రోగ్రాం ఇన్‌చార్జి గోవర్ధన శ్రీనివాసులు ఆధ్వర్యంలో జరిగిన వేడుకలకు ముఖ్య అతిథిగా తహసీల్దార్ సాకే గోపీనాథ్, కేఎస్ఎన్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కాలేజ్ ప్రిన్సిపాల్ డాక్టర్ శంకరయ్య, జనశిక్షణ సంస్థ డైరెక్టర్ సాధాగర్ హాజరయ్యారు. ప్రపంచానికి యోగాను పరిచయం చేసిన ఘనత మన దేశానికే దక్కుతుందన్నారు. యోగా గురువు మహేష్‌బాబు 150 మంది యువతీ యువకులతో సామూహిక యోగా చేయించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ లక్ష్మీరంగయ్య, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు ఫాతీ మున్నీసా, రామకృష్ణ, విజయ్‌కుమార్ పాల్గొన్నారు. అనంతరం యోగాదినోత్సవానికి ప్రతి ఏటా సహకరిస్తున్న సాయిట్రస్టు నిర్వాహకులను సత్కరించారు. అలాగే సాయినగర్‌లోని సాయిట్రస్టు కార్యాలయంలో ట్రస్టు అధ్యక్షుడు విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో యోగాభ్యాసనాలు చేసే విధానాన్ని వివరించారు.

ఆత్మకూరు: మండలంలోని కేజీబీవీ పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాల్లో యోగా దినోత్సవం జరుపుకున్నారు. కేజీబీవీ విద్యార్థులు పలు యోగాసనాలతో అలరించారు. కేజీబీవీ ప్రిన్సిపాల్ లీమారోజ్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శ్రీవాణి తదితరులు పాల్గొన్నారు.



రాప్తాడు: యోగా చేస్తున్న డ్వామా పీడీ వేణుగోపాల్ రెడ్డి, అధికారులు



ఎస్కేయూ ఇంజినీరింగ్ కళాశాలలో యోగా చేస్తున్న వీసీ ప్రొఫెసర్ కే.హుస్సేన్ రెడ్డి, రెక్టార్ ప్రొఫెసర్ జి.వెంకట నాయుడు, తదితరులు



ప్రభుత్వ నర్సింగ్ కళాశాలలో..



యోగా సాధన చేస్తున్న ప్రిన్సిపాల్ డాక్టర్ మాణిక్య రావు, సూపరింటెండెంట్ డాక్టర్ కేఎస్ఎస్



సెంట్రల్ యూనివర్సిటీలో యోగా చేస్తున్న డీన్ షీలా రెడ్డి, తదితరులు



ఎన్‌వైకే ఆధ్వర్యంలో యోగా వేడుకలు



యోగాసనాలు వేస్తున్న వైద్య విద్యార్థులు, స్టాఫ్‌నర్సులు



ఆత్మకూరు కేజీబీవీలో..

యోగా విద్యార్థులకు కలెక్టర్ ప్రశంస

అనంతపురం కల్చరల్: అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని వివేకానంద యోగ కేంద్రం తరుపున అనేక మంది విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరచి కలెక్టర్ నుంచి ప్రశంసలందుకోవడం ఆనందంగా ఉందని కేంద్రం అధ్యక్షుడు రాజశేఖరరెడ్డి తెలిపారు. వివేకానంద భవన్‌లో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. యోగా కేంద్రం, యోగాసన స్పోర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సమ్మర్ క్యాంపు నిర్వహించి సుమారు 100 మందికి నాలుగు చోట్ల 45 రోజుల పాటూ ఉచితంగా యోగా నేర్పించామన్నారు. ఈ నేపథ్యంలో పరేడ్ గ్రౌండ్‌లో జరిగిన కార్యక్రమంలో కలెక్టర్ వినోద్‌కుమార్ చేతుల మీదుగా వారికి ప్రశంసాపత్రాలను అందించామన్నారు. వివేకానంద భవన్‌లో పరమేశ్వరరెడ్డి, మాంటిస్సోరి స్కూల్లో కృష్ణ, సోమనాథ నగర్‌లో గురు రాజారావు, రామనగర్‌లో పుల్లయ్య తదితర యోగా గురువులు చొరవ తీసుకుని శిక్షణ ఇచ్చారని తెలిపారు. బాలికల విభాగంలో విజయారెడ్డి, సుధీర్ఘా రెడ్డి, సుమన, విశ్వాని, బ్రాహ్మిణీ, శ్రావ్య, బాలుర విభాగంలో యజ్ఞరూప్, విగ్నేష్, వినయ్, సుశాంత్ తదితరులు ప్రత్యేక కృషితో కలెక్టర్ ప్రశంసలందుకోవడం అభినందనీయమన్నారు. భవిష్యత్తులో కూడా చిన్నారులకు ఉచిత శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో దివాకర్, మారుతీ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



కలెక్టర్ వినోద్‌కుమార్ చేతుల మీదుగా సర్టిఫికెట్లు అందుకున్న విద్యార్థులు

'రైతులను విస్మరించడం సరికాదు'

రాప్తాడురూరల్: దేశానికి అన్నం పెట్టే రైతులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విస్మరించాయని సీపీఐ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి సి.మల్లికార్జున మండిపడ్డారు. రైతులను ప్రోత్సహించే ఏరువాక పౌర్ణమి, వ్యవసాయ సాగు కార్యక్రమాలు చేపట్టకుండా విస్మరించడం రైతాంగాన్ని అవమానించడమేనని పేర్కొన్నారు. ఏరువాక పౌర్ణమి సందర్భంగా శుక్రవారం జిల్లా రైతు సంఘం ఆధ్వర్యంలో అనంతపురం మండలం కందుకూరు గ్రామ పొలంలో ఏరువాక సాగు పౌర్ణమి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మల్లికార్జున మాట్లాడుతూ.. వ్యవసాయ రంగానికి ప్రోత్సాహాలు ఇవ్వడంలో ప్రభుత్వం విఫలం చెందాయన్నారు. వ్యవసాయ రంగం నిర్వీర్యం కాకుండా ఒక్కో రైతు కుటుంబానికి ప్రతినెలా రూ.10 వేలు పింఛన్ ఇవ్వాలన్నారు. సాగు నీటి ప్రాజెక్టులు యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని కోరారు. ఉపాధి హామీ పథకాన్ని వ్యవసాయానికి అనుసంధానం చేయాలని సూచించారు. నకిలీ విత్తనాలను అరికట్టి నకిలీ విత్తనాలు అమ్మే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. రైతులకు రుణాలు మంజూరు చేయాలని పేర్కొన్నారు. పాడిపశువులకు గొర్రెలకు మేకలు కూడా విరివిగా రుణాలు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి వన్నారెడ్డి, ఉపాధ్యక్షుడు పి.రామకృష్ణ, కౌలు రైతు సంఘం ప్రధాన కార్యదర్శి ఎస్.రామకృష్ణ. నాయకులు వెంకటరాముడు, బుల్లే నగేష్, పుల్లారెడ్డి, శ్రీరాములు, నల్లప్ప, ఓబులేసు, రామాంజనేయులు, శివయ్య, లింగమయ్య, బ్రహ్మయ్య పాల్గొన్నారు.



ఏరువాక కార్యక్రమం నిర్వహిస్తున్న దృశ్యం

సీజనల్ వ్యాధులపై అప్రమత్తత అవసరం

రాప్తాడు: గ్రామీణ ప్రాంతాల్లో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు చేపట్టాలని ఎంపీడీఓ గీతావాణి, వైద్యాధికారి శివకృష్ణ ఆదేశించారు. శుక్రవారం మండల కేంద్రంలో సీజనల్ వ్యాధుల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. అనంతరం వైద్య సిబ్బంది గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ.. వర్షాకాలంలో మలేరియా, డెంగీ, అతిసారం వంటి సీజనల్ వ్యాధులు సోకే అవకాశం ఉందన్నారు. ఈ నేపథ్యంలో ప్రతి ఒక్కరూ తగిన జాగ్రత్తలు పాటించాలన్నారు. వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రత కూడా పాటించాలన్నారు. ప్రధానంగా మురుగునీటి నిల్వలు, చెత్తా చెదారం ఉన్నచోట దోమలు ఎక్కువగా పెరిగే అవకాశం ఉందని పేర్కొన్నారు. వీటి కారణంగా మలేరియా, డెంగీ జ్వరాలు వస్తాయన్నారు. గ్రామాల్లో దోమల నివారణ మందు పిచికారీ పనులను ముమ్మరం చేయాలన్నారు. అలాగే కాలువలు, మురుగు నీటి నిల్వల ప్రాంతాలు, ఇళ్ల వద్ద దోమల నివారణ మందు పిచికారీ చేయిస్తున్నామన్నారు. ప్రతి శుక్రవారం డ్రైడే తప్పనిసరిగా పాటించి ఇంటి పరిసరాల్లో మురుగునీటి నిల్వలు లేకుండా చూడాలన్నారు. అనంతరం స్థాని బీసీ హస్టల్, కేజీబీవీ వసతి గృహాల్లో దోమల నివారణకు మందు పిచికారీ చేయించారు. కార్యక్రమంలో ఎంఈఓ మల్లికార్జున, ఈఓఆర్డీ నరసింహ రెడ్డి, మలేరియా సబ్ యూనిట్ ఆఫీసర్ మద్దయ్య, సూపర్‌వైజర్లు నూర్ బాషా, నరసింహ, శ్రీధర్, హేమలత, ఏఎన్ఎంలు అనిత, లీలావతి, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



రాప్తాడులో ర్యాలీ చేస్తున్న వైద్య సిబ్బంది

పరిసరాల శుభ్రతతో ఆరోగ్యం

ఆత్మకూరు: మన చుట్టూ ఉన్న ప్రదేశాలను శుభ్రంగా ఉంచుకోవడం ద్వారా మనం ఆరోగ్యకరంగా ఉంటామని ఎంపీడీఓ దశరథరామయ్య, మండల వైద్యాధికారి సబిహా సుల్తానా తెలియజేశారు. శుక్రవారం మండలంలోని పలు గ్రామాల్లో డ్రైడే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అపరిశుభ్రత నెలకొన్న ప్రదేశాల్లో వైద్య సిబ్బంది, పంచాయతీ సిబ్బందితో కలసి బ్లీచింగ్ పౌడర్ పిచికారీ చేశారు. ఎక్కువ రోజులు ఇళ్లలో నీరు నిల్వ ఉండటం వల్ల నీటిలో లార్వా చేరి జ్వరాలు వ్యాపించే ప్రమాదం ఉందన్నారు. ఎక్కువ రోజులు ఇళ్లలో నీరు నిల్వ ఉంచరాదని సూచించారు. వర్షాకాలంలో జ్వరాలు వ్యాపించే ప్రమాదం ఉందన్నారు. సీజనల్ వ్యాధులపై ప్రజలు జాగ్రత్తగా ఉండాలని సూచించారు. అనారోగ్యానికి గురైతే వెంటనే ఆసుపత్రికి వెళ్లి చికిత్స చేయించుకోవాలని తెలిపారు.



ఆరోగ్య సూచనలిస్తున్న ఎంపీడీఓ, డాక్టర్

గ్రేడ్-1 నర్సింగ్ సూపరింటెండెంట్‌గా నాగమణి

అనంతపురం మెడికల్: ప్రభుత్వ సర్వజనాస్పత్రి గ్రేడ్-1 నర్సింగ్ సూపరింటెండెంట్‌గా నాగమణి నియమితులయ్యారు. శుక్రవారం విజయవాడలో గ్రేడ్-1 నర్సింగ్ సూపరింటెండెంట్ల కౌన్సెలింగ్ జరిగింది. అందులో గ్రేడ్-2 నర్సింగ్ సూపరింటెండెంట్‌గా ఉన్న నాగమణి పదోన్నతిపై అనంతపురం జీజీహెచ్‌కు గ్రేడ్-1 నర్సింగ్ సూపరింటెండెంట్‌గా రానున్నారు. ఈమె అనంతపురం జీజీహెచ్ గ్రేడ్-2 నర్సింగ్ సూపరింటెండెంట్‌గా ఉన్నప్పటికీ.. డెప్యుటేషన్‌పై కర్నూలు జీజీహెచ్‌లో విధులు నిర్వర్తించేవారు.

నేడు పుస్తకావిష్కరణ

అనంతపురం కల్చరల్: సీనియర్ రచయిత్రి డాక్టర్ ఎం.ప్రగతి రచించిన 'ప్రతి ఫెయిల్యూర్‌లో ఓ గెలిచే దారి' పుస్తకావిష్కరణ శనివారం ఉదయం 10:30 గంటలకు స్థానిక ఆర్ట్స్ కాలేజ్ డ్రామా హాలులో జరుగనుంది. ఈ కార్యక్రమానికి అనేక మంది విద్యావేత్తలు, సాహితీప్రియులు విచ్చేయనున్నారు.

ప్రభుత్వ కళాశాల (స్వయం ప్రతిపత్తి) అనుబంధ వసతి గృహము : అనంతపురము

షార్ట్ టెండరు ప్రకటన

ప్రభుత్వ కళాశాల అనుబంధ హాస్టల్‌కు 2024-2025 విద్యా సంవత్సరానికి కిరాణా సరుకులు, కూరగాయలు సరఫరా చేయడానికి ప్రతి ఐటమ్‌కు (అంశము) విడివిడిగా సంబంధిత వ్యాపారంలో అనుభవం ఉన్న వారి నుండి సీల్డ్ టెండర్లు కోరబడుచున్నవి. అదే విధంగా హాస్టల్ నందు లభ్యమయ్యే ముసరు తీసుకొని పోవడం కోసం టెండరు కోరబడుచున్నది. అన్ని వివరములతో కూడిన టెండరు షెడ్యూలు హాస్టల్ మేనేజర్ కార్యాలయంలో 22-06-2024 నుండి 28-06-2024 వరకు అన్ని పనిదినాలలో ఉదయం 10-00 గం॥ల నుండి సాయంకాలం 5-00గం॥ల వరకు రూ॥ 200/-లు నగదు చెల్లించి పొందవచ్చును. భర్తీ చేసిన టెండరు షెడ్యూలు కళాశాల ప్రిన్సిపాల్ కార్యాలయంలో 28-06-2024న సాయంకాలం 5-00 గం॥లలోపల దాఖలు చేయాలి. సదరు టెండర్లను 29-06-2024 ఉదయం 11-00 గం॥లకు తెరవబడును.

గమనిక : ఏ కారణం చేతనైనా టెండర్లు రద్దు చేయుటకు గాని, వాయిదా వేయుటకు గాని హాస్టల్ పరిపాలనా కమిటీకి అధికారము కలదు.

అనంతపురం.
తేది : 21-06-2024

సం/- ప్రిన్సిపాల్,
గవర్నమెంట్ కాలేజ్ (అటానమస్), అనంతపురము.

నేడు ఆలిండియా డ్యాన్స్ ఫెస్టివల్



నృత్యంలో శిక్షణ ఇస్తున్న సంధ్యామూర్తి (ఫైల్)

- టీటీడీ వేదికగా సంధ్యారవళి
- 300 మంది కళాకారులు పాల్గొనే అవకాశం

అనంతపురం కల్చరల్: స్థానిక తిరుమల తిరుపతి దేవస్థానాల కల్యాణ మండపంలో సంధ్యారవళి పేరిట నాట్యోత్సవాలు (ఆలిండియా డ్యాన్స్ ఫెస్టివల్) నిర్వహణకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. శనివారం ఉదయం 9 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకూ నిర్విరామంగా వందల సంఖ్యలో కళాకారులు వివిధ నాట్యరీతులను ప్రదర్శించనున్నారు. ఉదయం ప్రారంభ కార్యక్రమంలో, రాత్రి ముగింపు వేడుకలకు వేర్వేరుగా ప్రజాప్రతినిధులు, అధికారులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు ముఖ్య అతిథులుగా విచ్చేసి కళాకారులను సత్కరిస్తారు. వివిధ రాష్ట్రాల నుంచి అనంత నాట్యోత్సవంలో పాల్గొనే గురువులకు 'నృత్యభారతి' అవార్డులు, నాట్య కళాకారులకు 'నాట్య తులసి' అవార్డులతో గౌరవించనున్నారు. గుజరాత్, చెన్నై, బెంగళూరు వంటి ఇతర రాష్ట్రాలతో పాటూ ఉమ్మడి జిల్లా నుంచి అధిక సంఖ్యలో కళాకారులు పాల్గొంటారు. భరత నాట్యం, కూచిపూడి, కేరళ నటనం, కైకొట్టు కళి, మోహిని ఆట్టంలోని ప్రాచీన కళారూపకాలను 300 మంది కళాకారులు నయన మనోహరంగా ప్రదర్శించడానికి సిద్ధమయ్యారు. దశాబ్దాలుగా నృత్యకళానిలయం చిన్నారులు దేశవిదేశాలలో అనంత నాట్యపతాకాలను రెపరెపలాడిస్తున్నారు.

ఏటేటా పెరుగుతున్న కళాఖ్యాతి..

ఇప్పటి వరకు వేల సంఖ్యలో శిష్యులకు సంగీతం, శాస్త్రీయ నృత్యంలో శిక్షణ ఇచ్చిన సంధ్యామూర్తి ఇప్పటికే వివిధ వేదికలపై శిష్యులతో కలిసి నృత్యం చేస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు. ఐదు దశాబ్ధాలుగా ఆమె శిష్యులు మన దేశంలోని వివిధ రాష్ట్రాలు, సింగపూర్, జర్మనీ, దుబాయ్, మలేషియా వంటి విదేశాలలో ప్రదర్శనలిచ్చారు. మరి కొంత మంది సొంతంగా శిక్షణాలయాలు ఏర్పాటు చేసుకుని గొప్ప స్థాయిలో రాణిస్తున్నారు. సంధ్యామూర్తి 2014లో అన్నమాచార్య అష్టోత్తర శతనామ సంకీర్తన పేరుతో సంగీతంలో, 2015లో దశదేవతా నృత్యారాధన పేరుతో 10 గంటల నిర్విరామ శాస్త్రీయ నృత్యంలోనూ 2020లో సారంగ లాసిత పేరుతో 108 సంగీత కారులు, మరో 108 మంది నాట్య కళాకారులతో కలసి సాగిన ప్రత్యేక ఉత్సవంతో లిమ్కా, జీనియస్, వండర్ బుక్ ఆఫ్ రికార్డ్సును తిరగ రాశారు. అదే విధంగా సంధ్యారవళి పేరుతో ఇతర రాష్ట్రాలకు చెందిన నాట్యకళాకారులను పరిచయం చేస్తున్నారు.